క్లుప్తంగా

రేపు శ్రీరామనవమి



సీతారామలక్ష్మణులు

ఆదోని అర్బన్: స్థానిక శ్రీరామ దేవాలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. విక్టోరియాపేటలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి వార్లకు వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం కల్యాణోత్సవం, పల్లకీసేవ, రథోత్సవం జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మంగరాయ సన్నిధిలో..

పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ సన్నిధిలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచార్ శుక్రవారం తెలిపారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలతోపాటు పంచామృతాభిషేకం, సుందరకాండ హోమం, నవగ్రహ హోమం, అనంతరం సీతారాముల కల్యాణోత్సవం జరిపిస్తామని చెప్పారు.

నేడు గంజిహళ్లిలో నెల పూజ


గంజిహళ్లిలోని బడేసాహెబ్ తాత దర్గా

గోనెగండ్ల: గంజిహళ్లి గ్రామంలో వెలసిన బడేసాహెబ్ తాత నెల ఉరుసు శనివారం జరగనున్నట్లు పీఠాధిపతులు తెలిపారు. స్వామి జీవ సమాధిని పూలతో అలంకరించనున్నారు. అదే రోజు సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన, భజన, గీతాలాపన తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

బాబూ జగ్జీవన్‌రాం సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: దేశ మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రాం సేవలు మరువలేనివని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బాలస్వామి అన్నారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలస్వామి మాట్లాడుతూ 1971లో ఇండియా–పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణశాఖ మంత్రిగా పనిచేశారన్నారు. రాజనీతిశాఖ అధిపతి డా.ఎం.అయ్యప్ప, ఆర్థికశాఖ అధిపతి డా.ఎం.రామకృష్ణ, అధ్యాపకులు వెంకటరామిరెడ్డి, గోపాల్ రెడ్డి, ఎల్లప్ప, విరుపాక్షప్ప, నిఖిల్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆటలో క్రీడాకారులు క్రీడస్ఫూర్తి ప్రదర్శించాలని నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు లక్ష్మన్న, నరసింహులు, పీఈటీ నర్సిమరాజు, ఉపాధ్యాయులు శేషాద్రి, పాఠశాల చైర్మన్ షేక్షావలి పాల్గొన్నారు.

బాలుడి మృతదేహానికి నివాళి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందిన బోయ రవి(13) మృతదేహానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు. వీరిలో జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు, కౌన్సిలర్ శివప్రసాద్, బుట్టా రేణుక పీఏ సందీప్, యువ నాయకుడు బి.బసిరెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గొల్ల కేశన్న, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, కోటేకల్ లక్ష్మన్న, కడివెళ్ల సర్పంచ్ రంగస్వామి, శ్రీను, జన హరికృష్ణ తదితరులు ఉన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మట్టి ఖర్చులకు రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. నాయకులు బొడ్డన్న, వెంకటేష్, వీరేష్, మారెన్న, నరసన్న, కేశన్న, శ్రీరాములు ఉన్నారు.

డ్రాప్ అవుట్ విద్యార్థుల కోసం ప్రణాళిక రూపొందించండి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: డివిజన్‌లో పాఠశాలలో డ్రాప్ అవుట్ అవుతున్న విద్యార్థులను పాఠశాలలకు తీసుకురావడానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విద్య, సాంఘిక సంక్షేమ, బీసీ వెల్ఫేర్, కేజీబీవీ హాస్టల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో డ్రాప్ అవుట్ అవుతున్న విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి స్కూళ్లో చేరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వివిధ కారణాలతో విద్యార్థులు గైర్హాజరయ్యారని, వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్‌లో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్‌ను ఎంఈఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో, విద్యాసంస్థల వద్ద మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎల్‌పీవో నూర్జహాన్, డిప్యూటీ ఈఓ వెంకటరమణరెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి రాజు కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలతో సమీక్ష

స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్–2025లో భాగంగా నియోజకవర్గంలోని ఫాం 6, 7, 8 నూతన ఓటరు నమోదు, చిరునామా, తదితర అంశాలపై బీఎల్‌వోలతో శుక్రవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమీక్షించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఓటర్ నమోదు, ఓటర్ దరఖాస్తులో తప్పిదాలు దొర్లకుండా బీఎల్‌వోలు చూసుకోవాలని చెప్పారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


హాజరైన బీఎల్‌వోలు

తహసీల్దార్ శివరాముడు, ఎన్నికల ఉప తహసీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

రీసర్వే పరిశీలన


రీసర్వేను పరిశీలిస్తున్న డీటీ శశిధర్‌స్వామి

నందవరం: మండలంలోని ముగతి గ్రామం రీసర్వే పైలట్ ప్రాజెక్టు–2గా ఎంపికైందని, రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని డీప్యూటీ తహసీల్దార్ శశిధర్‌స్వామి అన్నారు. శుక్రవారం గ్రామంలో రీసర్వేను డీటీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీసర్వే ద్వారా భూ సమస్యలు తొలగిపోతాయని, రైతులు అందుబాటులో ఉండి తమ భూములను సర్వే చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా రీసర్వేకు రైతుల సహకారం అవసరమన్నారు. రీ సర్వే ద్వారా భూమి సరిహద్దులు, కొలతలు, విస్తీర్ణం సరిపోల్చుకోవాలని రైతులకు చెప్పారు. సర్వే చేసే సమయాల్లో రైతులు సర్వే అధికారులకు అందుబాటులో ఉండాలన్నారు. వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ఫైరింగ్‌పై శిక్షణ



ఎంపికైన ఎన్‌సీసీ విద్యార్థులతో ఎన్‌సీసీ అధికారి పరిమళ

ఆదోని సెంట్రల్: ఎన్‌సీసీ విద్యార్థులకు ఫైరింగ్‌పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీసీ అధికారి పరిమళ తెలిపారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల నుంచి 33 మంది ఎన్‌సీసీ విద్యార్థినులు ఎంపికైనట్లు చెప్పారు.శుక్రవారం కర్నూలులోని సిల్వర్‌జూబ్లీ కళాశాల మైదానంలో సిమిలేటర్ ఫైరింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎన్‌సీసీ అధికారులు వివరిస్తారని చెప్పారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

ఆదోని టౌన్: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న భోజనం, అల్పాహారాన్ని నాణ్యతగా తయారు చేసి పేదలకు వడ్డించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. శుక్రవారం ఎన్టీఆర్ సర్కిల్‌లోని అన్న క్యాంటీన్, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పూడిక తీత పనులను పరిశీలించారు. ప్రధాన కూడళ్లు, రోడ్లలో చెత్త పారవేయొద్దని, డస్ట్‌బిన్లలో వేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని పట్టణ ప్రజలను కోరారు.

ముగతిలో పల్లెనిద్ర

నందవరం: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్‌ఐ ఎం. కేశవ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో ఎస్‌ఐ పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతమైన గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంత జీవనం అలవర్చుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోసిగి: సజ్జలగుడ్డం గ్రామంలోని గొల్ల మారెమ్మ వనంలో కంప చెట్టు కింద ఆరుగురు పేకాటరాయుళ్లను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు కోసిగి ఎస్‌ఐ హనుమంతు రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.24,550 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట, మట్కా, జూదం ఆడి జీవితాలు నాశనం చేసుకోకూడదన్నారు. దాడుల్లో ఏఎస్‌ఐ తిరుపాల్ నాయక్, కానిస్టేబుల్స్ మునిస్వామి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, షేక్షావలి, రామ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణతో జీవనోపాధి

పెద్దకడబూరు: మహిళలు కుట్టు మిషన్ శిక్షణతో జీవనోపాధి పొందాలని టైలరింగ్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రభావతి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇచ్చారు. ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో మంత్రాలయం కో ఆర్డినేటర్ విజయ్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి,


పూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా మహా కుంభాభిషేకం

ఆదోని అర్బన్: పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవికి శుక్రవారం మహాకుంభాభిషేకం ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 101 కలశాలతో ఊరేగించి కుంభాభిషేకం జరిపించారు. మధ్యాహ్నం అన్నప్రసాదసేవ, సాయంత్రం విద్యుత్ దీపాలంకరణ, మంగళవాయిద్యాలతో అమ్మవారికి పల్లకోత్సవం చేపట్టారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, వేణుగోపాల్, సభ్యులు శ్రీనివాస్, టి.జి.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన గణేష్ అనే యువకుడిపై త్రీటౌన్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపిన మేరకు వివరాలు.. గణేష్ త్రీటౌన్ పరిధిలో ఓ యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని, అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నాడని బాధిత యువతి, ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

శక్తి యాప్‌తో రక్షణ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ పోలీస్ నాగన్న

గోనెగండ్ల: మహిళల భద్రత కోసం శక్తి యాప్ ఉందని, దీని ద్వారా సత్వర సేవలు అందనున్నాయని శక్తి టీమ్ పోలీస్ నాగన్న తెలిపారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ షాహీనా పర్వీన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్న పిల్లల భద్రత కోసం శక్తి యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. ఆకతాయిల ఆట కట్టించడానికి శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సెల్‌ఫోన్ వాడుతున్న మహిళలందరూ శక్తి యాప్‌ను డౌన్‌లోన్ చేసుకోవాలన్నారు. ఎక్కడైన మహిళలకు ఆపద వస్తే 112 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు శ్రీదేవి, అనసూయ, రాణి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

నందవరం: మండల పరిధిలోని గంగవరం గ్రామ సమీపంలో శుక్రవారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ వీరాచారి, బాలిక స్నేహకు గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నాగలదిన్నె గ్రామం నుంచి గంగవరం గ్రామానికి ఆటో బయలుదేరింది. అందులో ప్రైవేట్ స్కూల్‌కి చెందిన బాలికలు లావణ్య, స్నేహ గంగవరం గ్రామానికి వెళ్తున్నారు. మార్గం మధ్యలో గంగవరం– జోహరాపురం గ్రామాల మధ్య ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ వీరాచారికి, స్నేహకి రక్త గాయాలయ్యాయి. స్నేహను బైక్‌పై ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే ఆటో డ్రైవర్ వీరాచారిని అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. లావణ్యకు ఈ ప్రమాదంలో ఎలాంటి గాయాలు కాలేదు.

సమాజాన్ని పురోగమింపజేసేది ధర్మమే


గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

గోనెగండ్ల: సమాజంలో ఐకమత్యంతో పాటు అనురాగాన్ని, ఆత్మీయతలను పాదుకొల్పేది ఆధ్యాత్మికత మాత్రమేనని, ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. గోనెగండ్ల మండలం అలువాల గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు గోపూజ, కుంకుమార్చన నిర్వహించారు. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం మహాభారతం, భగవద్గీతలపై ధర్మ ప్రచారకులు జగదీష్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు భక్తులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అలువాల వెంకట్రామిరెడ్డి, తిమ్మాపురం మురహర రెడ్డి, సోమన్న, కర్రెన్న, నారాయణరెడ్డి, జగదీష్, జయరాముడు, సోమిరెడ్డి, కొలుట్ల, తులసి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపార నష్టం..


నేలకొరిగిన వరిపైరు

కౌతాళం: మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మండల పరిధిలోని వల్లూరు, గుడికంబాలి, మరళి గ్రామాల్లో వరి పంట ఎక్కువగా సాగు చేశారు. వారం రోజుల్లో ఈ పంట చేతికి వస్తుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పంట నేలకొరిగిపోయిందని రైతులు రుద్రగౌడ్, బసవరాజు, దేవణ్ణ, దేవప్పగౌడ్ వాపోయారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

కారు, ఆటో ఢీ.. నలుగురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


బోల్తా పడిన ఆటో

ఆదోని అర్బన్: మండలంలోని దిబ్బనకల్ గ్రామ సమీపంలో శుక్రవారం కారు, ఆటో ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన మేరకు వివరాలు.. రాయచోటి జిల్లా కోడూరు మండలం మంగంపేటకు చెందిన భార్యాభర్తలు పార్వతి, రామచంద్ర, అటికెలగుండుకు గ్రామానికి చెందిన అన్నదమ్ములైన నాగరాజు, లక్ష్మీనారాయణ ఆటోలో వెళ్తుండగా మార్గ మధ్యలో కర్ణాటక నుంచి కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు పార్వతి, రామచంద్ర, అన్నదమ్ములైన నాగరాజు, లక్ష్మీనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కానిస్టేబుల్ తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

బాధ్యతలు స్వీకరించిన ‘బార్’ నాయకులు


మాట్లాడుతున్న సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: ఇటీవల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన శ్రీరాముల ప్యానెల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి పి.జె.సుధ, పీడీఎం కోర్టు జడ్జి అర్చన, ఫస్ట్ అడిషనల్ జడ్జి లీలాసాయిసుభాష్ పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అభ్యున్నతి కోసం పాటు పడతామని వారు తెలిపారు. జనరల్ సెక్రటరీ ఎల్.కె.జీవన్‌సింగ్ మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు క్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే వీలైనంత త్వరగా బిల్డింగ్‌ను పూర్తి చేసేందుకు ప్రయతిస్తామని చెప్పారు. జడ్జి పి.జె.సుధ మాట్లాడుతూ బార్, బెంచ్‌కు సఖ్యత ఉన్నప్పుడే నాణ్యమైన తీర్పులు ఇవ్వడానికి సాధ్య పడుతుందన్నారు. సీనియర్ న్యాయవాదులు వై.ఆర్.మల్లికార్జున, జీవీ దేశాయి, బద్రినాథ్, శివకుమార్‌స్వామి, గిరిధర్, జూనియర్ న్యాయవాదులు హుసేన్‌సాని, రజనీ, తరుణ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను ఆదుకోవాలి


ఇరిగేషన్‌శాఖ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న యునియన్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ రంగ సంస్థలు, ఉద్యోగులు, కార్మికులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ ఇరిగేషన్ వర్క్ చార్జ్ ఎంప్లాయిస్ యునియన్ నాయకులు సుధాకర్, రామకృష్ణ నాయుడు, సిఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణలో కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దశలవారీగా ఉద్యమ కార్యాచరణ, కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 12,13 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వర్క్‌షాప్‌కు ఉద్యోగ,కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఆయా సంఘాల నాయకులు రాజు, శీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

గోనెగండ్ల: విధుల్లో ఉన్న ఆర్టీసీ కండెక్టర్ ఈడిగ వెంకటేశ్వర్లుపై పెద్దనేలటూర్ గ్రామానికి చెందిన ఎం.భూషణం దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. అలువాల గ్రామానికి చెందిన ఈడిగ వెంకటేశ్వర్లు ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో కండెక్టర్‌గా పనిచేస్తున్నాడు. మార్చి 30వ తేదీ ఎమ్మిగనూరు నుంచి దైవందిన్నె మీదుగా పెద్దనేలటూర్ గ్రామానికి బస్సు వస్తోంది. భూషణం అనే వ్యక్తి పెద్దనేలటూర్‌కు వచ్చేందుకు దైవందిన్నె గ్రామం దగ్గర వేచి ఉన్నాడు. అయితే బస్సు స్టాప్ దగ్గర కాకుండా ముందు ఆగిందని భూషణం కండెక్టర్‌తో గొడవ పెట్టుకున్నాడు. అదే రోజు రాత్రి బస్సు పెద్దనేలటూర్ గ్రామంలోనే ఉంది. మరుసాటి రోజు ఉదయం ఎందుకు బస్సు ఆపలేదని భూషణం, విధుల్లో ఉన్న కండెక్టర్‌తో గొడవపెట్టుకుని నానా దుర్భాషలాడాడు. కండెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భూషణంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపాడు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

మండలంలోని ఎస్ లింగందిన్నె గ్రామానికి చెందిన గొల్ల శ్రీరాముడుపై అదే గ్రామానికి చెందిన కురువ పెద్దయ్య పొలానికి నీళ్లు వదిలే విషయంలో గొడవ పడి ముక్కుపై రాయితో కొట్టాడు. దీంతో శ్రీరాముడు ముక్కుకు రక్తగాయం అయ్యింది. అతని ఫిర్యాదు మేరకు పెద్దయ్యపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో శనివారం జరిగే సద్గురు బడేసాహెబ్ తాత నెల ఉరుసును ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ విజయభాస్కర్ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉరుసుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని.. ఈ మేరకు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీకలబెట్ట సర్పంచ్‌కు పరామర్శ


సర్పంచ్ లక్ష్మిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి

పెద్దకడబూరు : మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామ సర్పంచ్ మూలింటి లక్ష్మీ అనారోగ్య సమస్యతో ఆదోనిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సర్పంచ్‌కు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, మూకిరెడ్డి, నాగరాజు, ఈరన్న తదితరులు ఉన్నారు.

పశు బీమాతో పాడిరైతుకు భరోసా


ఆవుకు చూడి పరీక్షలు చేస్తున్న పశువైద్యుడు

నందవరం: పాడి రైతులు పశువుల బీమాను సద్వినియోగం చేసుకోవాలని ముగతి పశువైద్యుడు డాక్టర్ బెన్ని హేమంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని పశువైద్యశాలలో ఆవులకు చూడి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిరైతులు రూ.150 చెల్లిస్తే 3 ఏళ్లకు పశువులకు బీమా వర్తిస్తుందన్నారు. నాటు గేదెలకు రూ.15 వేలు, జెర్సీ గేదెలకు రూ.30 వేలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని వివరించారు. అలాగే వేసవి దృష్ట్యా పశువుల పెంపకంపై పాడిరైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశువుల పాకలను చల్లటి ప్రదేశంలో ఏర్పాటు చేయాలన్నారు. పశువులకు నీరు ఎక్కువగా తాపించాలని, డీహైడ్రేడ్ ఉంటే కలకండ నీరు తాగించాలన్నారు. వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఏసేపు, రాజు, ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు పంటల సాగుపై పెట్టుబడులు పెరిగిపోయాయని, గిట్టుబాటు ధరలు లేవని వాపోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతాంగ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. రైతు సంఘం నాయకులు ఈరన్న, నరసింహులు, బజారి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com